క్లుప్తంగా

ఆసక్తి గల అంశాల్లో పిల్లలను ప్రోత్సహించాలి



తయారు చేసిన డిజైన్లతో పిల్లలు

మురళీనగర్: తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతోపాటు ఆసక్తి గల అంశాల్లో ప్రోత్సహిస్తే రాణిస్తారని జిల్లా 101 గవర్నర్ యు.సుభ అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో ప్రొఫెషనల్ ఫెవికాల్ ఉపాధ్యాయిని సిహెచ్.విద్యావతి ఆధ్వర్యంలో బుధవారం పిల్లలకు కూరగాయలతో రకరకాల డిజైన్లు తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. సుమారు 20 మంది పిల్లలు హాజరై కూరగాయలతో రకరకాల డిజైన్లు తయారు చేశారు. గ్రంథాలయ అధికారి వై.పద్మజ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జి.షీలారాణి, జామి అన్నాజీ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



కోట మౌనిక

మల్కాపురం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక యువతి అదృశ్యంపై ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కప్పరాడ దరి సురేష్‌రామ్‌నగర్‌కు చెందిన కోట మౌనిక ఒక కళాశాలలో చదువుకుంటూ తల్లిదండ్రులతో నివసిస్తోంది. ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు చుట్టుపక్కల ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో యువతి తల్లి కోట సూర్యకుమారి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. కోట మౌనిక ఆచూకీ తెలిసిన వారు డయల్ 100కి తెలియజేయాలని పోలీసులు కోరుతున్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

మల్కాపురం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి ఒక కారు ఢీకొనడంతో జర్నలిస్ట్‌కు గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎన్ఏడీ కొత్తరోడ్డు నుంచి కంచరపాలెం మెట్టు వైపు వేగంగా వస్తున్న ఒక కారు(ఏపీ26పీ 7878).. అదే క్రమంలో ఊర్వశి జంక్షన్ వద్ద బైకును ఢీకొనడంతో శేషగిరిరావు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న స్థానికులు, వాహన చోదకులు అతడిని ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనలో బైకును ఢీకొని కారు ఆపకుండా వెళ్లిపోయారు. సీఐ విజయకుమార్ పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: బాపూజీ నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు బాపూజీ నగర్, భవానీ గార్డెన్స్, సిద్ధార్థ నగర్, గణేష్ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఓటమి భయంతోనే విమర్శలు

సీతంపేట: ఎన్నికల్లో ఓటమి భయంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజాంపట్నం సభలో తమ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌పై అవాకులు చెవాకులు పేలారని జనసేన పార్టీ పీఏసీ మెంబర్ కోన తాతారావు విమర్శించారు. ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి రింగ్ రోడ్డుకు.. కాజ దగ్గర పవన్ కొనుగోలు చేసిన భూమికి లింకు పెట్టి అర్థం లేని విమర్శలు చేస్తున్నారన్నారు. మంచి పాలన అందించానంటూ పరదాల చాటున జిల్లాల్లో ఎందుకు పర్యటిస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో జనసేన నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, పంచకర్ల సందీప్, పీతల మూర్తియాదవ్, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో కొత్తగా నిర్మించిన జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల భవనం

స్మార్ట్ స్కూల్

- కార్పొరేట్ స్థాయిలో ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల
- రూ.1.96 కోట్లతో అభివృద్ధి
- అదనపు భవనంతో సమకూరనున్న 5 తరగతి గదులు
- లెర్నింగ్ బేస్డ్ స్కూల్ ఎన్విరాన్‌మెంట్



ఆధునిక తరగతి గది

సీతంపేట: నాడు సాదా సీదాగా ఉండే జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలు.. నేడు స్మార్ట్ స్కూల్‌గా మారిపోయాయి. కనీస సదుపాయాలకు నోచుకోని స్థాయి నుంచి సకల సౌకర్యాలతో రూపాంతరం చెందాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యకు ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనంగా సర్కారు బడులు నిలుస్తున్నాయి. 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునికీకరిస్తున్నారు. స్కూల్‌లో రూ.1.96 కోట్లతో నిర్మిస్తున్న అదనపు భవనం, పాత భవనం అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయి. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, సిటీస్ ప్రొగ్రాం కింద రూ 1.96 కోట్లు నిధులతో పాఠశాల అభివృద్ధి, అదనపు భవన నిర్మాణం, మౌలిక సదుపాయాలు కల్పించారు. గతేడాది సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. దాదాపు అవి పూర్తికాగా.. వాలీబాల్ కోర్టు ఆట స్థలం అభివృద్ధి పనులు మాత్రం చేయాల్సి ఉంది. రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని సదుపాయాలతో విద్యార్థులకు పాఠశాల అందుబాటులోకి వస్తుంది.

లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్ స్కూల్..

పరిసరాల నుంచి విద్యార్థులు పలు విషయాలు నేర్చుకునేలా పాఠశాలను తీర్చిదిద్దుతున్నారు. ఇందులో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, కంపోస్ట్, గ్రాప్స్ టు క్లాస్ రూమ్, ప్రిజర్వ్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. రిక్రియేషన్ కోసం సురక్షిత బహిరంగ ఆట స్థలాలు, ఆట పరికరాలు, నేచర్ బేస్డ్ లెర్నింగ్, ఆరుబయట కూర్చునేలా బెంచీలు, ఆర్వో వాటర్, మెరుగుపర్చిన టాయిలెట్లు, హ్యాండ్ వాష్, వేస్ట్ బిన్స్ ఇలా స్టూడెంట్లకు మంచి అలవాట్లు నేర్పేలా స్కూల్‌ను మారుస్తున్నారు.



ఆరుబయట కూర్చోడానికి ఏర్పాటు చేసిన బెంచీలు



విద్యార్థులకు స్టోరేజీ ర్యాక్స్

సరికొత్తగా పాఠశాల భవనాలు..

కొత్తగా నిర్మిస్తున్న అదనపు భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు తరగతి గదులు, రెండు టాయిలెట్లు, పైఅంతస్తులో మూడు తరగతి గదులు నిర్మిస్తున్నారు. వాటిలో పిల్లలు కూర్చోడానికి అవసరమైన ఫర్నిచర్, బ్లాక్ బోర్డ్స్, నోటీస్ బోర్డ్స్, స్టోరేజ్ యూనిట్స్, టాయిలెట్లకు నిరంతర నీటి సరఫరా, తాగునీటి సదుపాయాలు కల్పించారు. గ్రౌండ్‌లో సెమీ ఓపెన్ డైనింగ్ హాల్ కమ్ స్టేజ్, వాలీబాల్ కోర్టు, యాక్టివిటీస్ బేస్డ్ లెర్నింగ్‌కు అనుగుణంగా లెర్నింగ్ టైల్స్, స్కేల్, స్నేక్స్ అండ్ లేడర్స్, పాత్‌వే పక్కన స్లైడింగ్ గేమ్స్‌తో ఆట స్థలాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

కోరుకున్న దానికంటే మిన్నగా

స్మార్ట్ సిటీస్ ప్రొగ్రాంకు జోన్–3లో ఐదు జీవీఎంసీ పాఠశాలలు ఎంపిక కాగా.. 26వ వార్డుకు చెందిన మాది ఒకటి. మేము కోరుకున్న దానికంటే మిన్నగా స్కూల్ అభివృద్ధి జరుగుతోంది. దాదాపు పనులన్నీ పూర్తయ్యాయి. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కొత్త భవనాలు, పరిసరాలు విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి.

– కె.పద్మజారాణి, ప్రధానోపాధ్యాయురాలు

కార్మికుల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ లక్ష్యం



నూతన వాహనాలతో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, అధికారులు

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- రెండు పొక్లెయిన్లు, ఒక సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనం ప్రారంభం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలోని పారిశుధ్య కార్మికుల కోసం నూతనంగా సమకూర్చిన వాహనాలను బుధవారం తాటిచెట్లపాలెంలోని మినీ సూయేజ్ ఫాం–5లో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందులో భాగంగా నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ) సహకారంతో నమస్తే స్కీం ద్వారా పారిశుధ్య కార్మికులకు రాయితీపై రెండు పొక్లెయిన్లు, ఒక సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాన్ని అందజేసినట్లు చెప్పారు. వాహనాల రాయితీని ఏడేళ్ల పాటు జీవీఎంసీ చెల్లిస్తుందని, దీని ద్వారా పారిశుధ్య కార్మికుడికే లబ్ధి చేకూరుతుందన్నారు. తద్వారా కార్మికులు ఆర్థికంగా బలోపేతమవుతారని మేయర్ తెలిపారు. ఐదుగురు పారిశుధ్య కార్మికులు గ్రూపుగా ఏర్పడి ఒక్కో వాహన నిర్వహణ బాధ్యతను చూసుకుంటారని పేర్కొన్నారు. ప్రధాన గెడ్డల్లో పూడికలు తీసేందుకు వీటిని వినియోగిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, జోన్–5 ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లవేళలా పరిశుభ్రంగా వార్డులు

- యుద్ధప్రాతిపదికన వ్యర్థాల తరలింపు
- జెడ్సీలకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం



పీ అండ్ టీ కాలనీలో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సీతమ్మధార: వార్డుల్లో చెత్త కుప్పల నిల్వలు లేకుండా యుద్ధప్రాతిపదికన డంపింగ్ యార్డుకు తరలించాలని జోనల్ కమిషనర్లను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. సీతమ్మధార, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులోని డంపర్ బిన్ల చుట్టూ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలన్నారు. డోర్ టూ డోర్ చెత్త సేకరిస్తుతున్నప్పుడు డస్ట్ బిన్లలోకి ఎలా చేరుతోందని ఆరా తీశారు. పారిశుధ్య కార్యక్రమాల్లో పుష్ కార్ట్ ద్వారా చెత్తను నేరుగా క్లాప్ వాహనానికి అందించేలా చూడాలని సూచించారు. సచివాలయం పరిధిలో శానిటరీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి వార్డులో వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. సీన్ పాయింట్ వారీగా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేసుకొని రోడ్లు, కాలువలను శుభ్రపరచాలని సూచించారు. స్థానిక మయూరి కల్యాణ మండపం పక్క వీధిలో చెత్త ఎక్కువగా పేరుకుపోవడంతో దానిని వెంటనే పారిశుధ్య కార్మికులచే ఎత్తించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని ఆదేశించారు. అక్కయ్యపాలెం – దొండపర్తి ప్రధాన రహదారిని ఉదయం 6 గంటల నుంచి కార్మికులచే శుభ్రం చేయించాలని కమిషనర్ ఆదేశించారు. బీచ్ రోడ్డులోని సాగర్‌నగర్, రుషికొండ వరకు పర్యటించి జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ పనులు ఏవిధంగా చేస్తే బాగుంటుందని పరిశీలించారు. సాగర్‌నగర్‌లో మరుగుదొడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పర్యటనలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్లు రవికృష్ణ రాజు, చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ కె.వి.ఎస్.రవి, కార్యనిర్వాహక ఇంజినీర్ మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమం.. సంతోషం



53వ వార్డులో సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న కె.కె.రాజు, బర్కత్ అలీ

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలంతా సంతోషంగా ఉన్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ కె.కె.రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం 53వ వార్డు మహారాణి వీధి– సచివాలయం(1086 297) పరిధిలోని రాజా ప్రతాప్‌నగర్, రామాలయం వీధి తదితర ప్రాంతాల్లో స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూ స్థానికుల ఎసమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. నాడు ప్రజలే ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి సమస్యలు చెప్పుకునే వారని.. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ సుపరిపాలనలో ప్రజాప్రతినిధులే గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకొని వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 53వ వార్డు ఇన్‌చార్జి గుజ్జు వెంకట రెడ్డి, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి సునీల్ కుమార్, డైరెక్టర్ రాయుడు శ్రీనివాసరావు, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, నాయకులు షేక్ బాబ్జీ, హనుమంత్, జ్ఞానేష్, సుశీల, నబీజోత్స్న, సూర్య, జయ, ఝాన్సీ, లక్ష్మి, మంగ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'జూన్ 30కి పూర్తి చేయండి'



టౌన్ ప్లానింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వరరావు

సీతమ్మధార: భవనాలు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకాల(బీపీఎస్, ఎల్ఆర్ఎస్) పెండింగ్ దరఖాస్తులను జూన్ 30 నాటికి పూర్తి చేయాలని జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆశీలమెట్టలోని జోన్–3 కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయపై ప్రభుత్వం ఆఖరి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. టౌన్ ప్లానింగ్ స్టాఫ్‌కు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో టీపీవో వినయ్‌ప్రసాద్, టీపీఎస్ తేజ, టీపీబీవో అనిత, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ముస్లింల ధన్యవాదాలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ బర్కత్ అలీ

సీతమ్మధార: హజ్ యాత్రికులకు ఆర్థిక సాయం అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీతోపాటు ముస్లిం నాయకుల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం వార్డులోని తన కార్యాలయంలో మీడియాతో బర్కత్ అలీ మాట్లాడారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన వాటితో పాటు అన్ని వర్గాల ప్రజలకు సంబంధించి ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తున్న సీఎం జగన్ మరో కొత్త అధ్యాయనాన్ని ఆవిష్కరించారన్నారు. హజ్ యాత్రకు వెళ్లే ఒక్కొకరికీ రూ.80 వేల ఖర్చవుతుందని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆయన సుమారు 1813 మందికి రూ.14.51 కోట్లు అందజేశారన్నారు. మరోసారి ముస్లిం మైనారిటీల పక్షపాతని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారని కొనియాడారు. సీఎం, డిప్యూటీ సీఎం, ఏపీ హజ్ కమిటీ చైర్మన్ షేక్ గౌస్ లాజమ్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు ఏడాది



ధ్యాన మందిరం కమ్యూనిటీ ఫ్రిజ్‌లోని ఆహారాన్ని పేదలకు అందిస్తున్న నూకల శేషగిరిరావు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటి ఫ్రిజ్‌లకు బుధవారంతో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు మాట్లాడుతూ 13 ఏళ్లుగా భక్తులు, పేదలకు నిత్యాన్నదానం ద్వారా ధ్యాన మందిరం సేవలందిస్తోందని తెలిపారు. ప్రతి రోజు యాచకులు, నిరుపేదలు సుమారు 100 మంది వరకు, గురువారాల్లో 200 మంది వరకు అన్నదానంలో పాల్గొంటున్నారన్నారు. ధ్యాన మందిర సేవలను గుర్తించిన ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ ఆర్థిక సాయంతో రెండు కమ్యూనిటీ ఫ్రిజ్‌లను గతేడాది మే 18న సమకూర్చింది. వీటి ద్వారా ఇక్కడ ఆహారాన్ని 24 గంటలూ అందుబాటులో ఉంచుతున్నారు. ఏ సమయంలోనైనా ఆకలితో ఉన్న వారు వచ్చి ఈ ఆహారాన్ని తీసుకుంటున్నారు. ప్రతి రోజు సుమారు 50 నుంచి 100 మందికి భోజనాలను ప్యాకెట్ల రూపంలో ఈ ఫ్రిజ్‌లలో ఉంచుతున్నామని మందిర వ్యవస్థాపకులు తెలిపారు.

ఉత్సాహంగా వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం



వ్యక్తిత్వ వికాస ప్రాధాన్యాన్ని వివరిస్తున్న నిపుణుడు డబ్బీరు రోహిత్

మురళీనగర్: స్థానిక వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థుల వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. వ్యక్తిత్వ వికాస నిపుణుడు డబ్బీరు రోహిత్ యువత తమ భవిష్యత్‌ను నాలుగు జోన్లుగా నిర్దేశించుకుని వాటి నుంచి తరువాత స్థాయికి చేరుకోవాలని వివరించారు. మొబైల్ వల్ల యువతకు జరుగుతున్న చెడు ప్రభావాలపై చర్చించారు. శిబిరంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ముఖ అతిథి వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.

గంజాయి రహిత నగరానికి సహకారం



ప్రచారం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: గంజాయి రహిత నగరానికి ఆటో డ్రైవర్లు సహకరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి, జిల్లా సమితి సభ్యుడు పడాల గోవింద్ కోరారు. సీతమ్మధారలో బుధవారం ఆటో డ్రైవర్లు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత విశాఖలో యువతీ, యువకుల ప్రాణాలతో చెలగాటమాడే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలు రద్దు చేయాలని, ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసులు, ఆర్టీవో అధికారులు ఇస్తున్న ఈ–చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రావికృష్ణ, హరి, రాజు, రమణ, ప్రసాద్, ముత్యాలనాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవో 84పై అవగాహన



జీవో 84పై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో హుస్సేన్

మురళీనగర్: నగరంలోని యూఎల్‌సీ భూముల్లో భవనాలు నిర్మించుకుని నివసిస్తున్న వారితో పాటు ఖాళీ స్థలాల్లో డీ పట్టాల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 84పై ఆర్డీవో హుస్సేన్ అవగాహన కల్పించారు. 49, 50 వార్డులకు సంబంధించి సత్యనగర్–1లో స్థానికులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలిపల్లి ప్రసాద్ సమక్షంలో ఆయన స్థానికులకు వివరాలు తెలియజేశారు. 150 గజాల వరకు డీపట్టా ఉచితంగా అందిస్తామన్నారు. 151 నుంచి మూడు 300 గజాల వరకు మార్కెట్ విలువపై 15 శాతం, 301 నుంచి 500 గజాల వరకు 30 శాతం, 500 దాటితే వంద శాతం మార్కెట్ విలువ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి సర్వే జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలపట్నం తహసీల్దార్, స్థానిక వీఆర్వో పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 0608100 11006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 89855 15989కు వాట్సాప్ చేయాలి.

23న జీవీఎంసీ జోన్–4 దుకాణాలకు వేలం

అల్లిపురం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ 4వ జోన్‌కు సంబంధించిన దుకాణాలు, కళ్యాణ మండపాలు, క్యాంటీన్‌కు 23వ తేదీ ఉదయం 11 గంటలకు 4వ జోన్ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్లు జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు నిర్ణీత తేదీలో జోనల్ కార్యాలయంలో జరుగు వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. పూర్తి వివరాలకు జోనల్ కార్యాలయం పనివేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు పర్యవేక్షణ అధికారిని సంప్రదించాలని తెలిపారు.

వేద విద్యను పునఃప్రారంభించాలని వినతి



స్పీకర్ తమ్మినేనికి వినతిపత్రం అందజేస్తున్న శివరామ, గొండు సీతారాం

బీచ్‌రోడ్డు: పూర్వం గురుకులాలు, విశ్వ విద్యాలయాల్లో వేదాలు, వాస్తు, జ్యోతిష్య శాస్త్రం విద్యను బోధించేవారని, మళ్లీ ఆ విద్యను పునఃప్రారంభించి భావితరాలకు అందించాలని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు వాస్తు జ్యోతిష్య పండితుడు లక్కోజు శివరామ కోరారు. నగరానికి వచ్చిన స్పీకర్‌ను బుధవారం ప్రభుత్వ అతిథిగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో చాలా మంది విద్యార్థులు జ్యోతిష్య శాస్త్రం చదివేందుకు ఆసక్తి చూపిస్తున్నారని అందులో పేర్కొన్నారు.

బాలల హక్కుల కమిషన్ మరింత చేరువ కావాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పిల్లలకు మరింత చేరువ కావాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నగర పర్యటనకు వచ్చిన ఆయన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కలిశారు. ఏడాది కాలంగా కమిషన్ చేపట్టిన కార్యక్రమాల నివేదికను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ దేశంలో ఇతర రాష్ట్రాల బాలల హక్కుల కమిషన్‌కు దీటుగా మన రాష్ట్ర కమిషన్ పనిచేయాలన్నారు. గొండు సీతారాం మాట్లాడుతూ కమిషన్ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించినట్లు చెప్పారు.

సలీం నవలలు సమాజ దర్పణాలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: పౌర గ్రంథాలయంలో సహృదయ సాహితీ ఆధ్వర్యంలో బుధవారం ప్రముఖ రచయిత సలీం రచించిన 'రెండు ఆకాశాల మధ్య' పుస్తక పరిచయ సభ జరిగింది. సభాధ్యక్షుడు సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సలీం నవలలు సమాజ దర్పణాలని కొనియాడారు. సలీం రచించిన 29 నవలల్లో కాలుతున్న పూలతోటకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని గుర్తు చేశారు. రెండు ఆకాశాల మధ్య నవలలో భారత్, పాకిస్తాన్ సరిహద్దు గ్రామాల ప్రజల దుర్భర జీవితాలను హృద్యంగా, సజీవంగా తనదైన శైలిలో పొందుపర్చారన్నారు. పుస్తకాన్ని అతిథులతో కలిసి ఆవిష్కరించారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ దేశ విభజన సమయంలో జరిగిన దారుణమైన నరమేధాన్ని చిత్రీకరించిన గొప్ప నవలగా అభివర్ణించారు. రచయిత ఎల్.ఆర్.స్వామి మాట్లాడుతూ సలీం రచనలు అందరినీ చదివింపజేస్తాయని, అనేక ఇతర భాషల్లో అనువదించారన్నారు. రచయిత ఆదూరి వెంకట సీతారామమూర్తి, సీహెచ్ చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, డి.వి.సూర్యారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, అర్నాద్, మేడా మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.